అమెరికా చేతిలో మోడీ బానిస

- పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల

ప్రజాశక్తి-కలికిరి/పుంగనూరు

అమెరికా చేతిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బానిస అని పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర నాల్గవ రోజు గురువారం అన్నమయ్య జిల్లా కలికిరి, పుంగనూరు మండలాల్లో సాగింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడుతూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు సున్నా చేయడం దారుణమన్నారు. ఆ దేశ వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే మన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండవని వివరించారు. ఇది మన దేశ రైతులను మోసం చేసినట్లు కాదా?, రైతులను హింసించినట్లు కాదా? అని మోడీని ప్రశ్నించారు. జగన్, చంద్రబాబు కలిసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని విమర్శించారు. సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. పని హక్కు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇప్పుడు ఆ పని హక్కును బిజెపి కాలరాస్తుందన్నారు. ఉపాధి చట్టం పునరుద్ధరణకు ప్రతి పేద కుటుంబం నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

50 కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - గొలుగొండ (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట సమీపంలో 50 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏడుగురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను నర్సీపట్నం డిఎస్‌పి పి శ్రీనివాసరావు గురువారం మీడియాకు వెల్లడించారు. గంజాయి తరలింపు విషయమై అందిన సమాచారం ప్రకారం.. కృష్ణదేవిపేట ఎస్ఐ రుషికేశ్వరరావు గురువారం ఉదయం పల్లపూరు చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారులో 50 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో పోలవరం జిల్లా రాజవొమ్మంగికి చెందిన గంటిమల్ల రాజ్ కుమార్ ప్రధాన నిందితుడు. ఆయనపై ఇప్పటికే 14 కేసులు ఉన్నాయి. చిత్రకొండ వద్ద గంజాయి కొనుగోలు చేసి రాజమండ్రి తీసుకెళుండగా పట్టుబట్టాడు. ఈ కేసులో రాజ్‌కుమార్‌తో పాటు అభినేష్ మునియప్పన్, మెరిపో కిశోర్, గంటిమల్ల లోవరాజు, చెన్నాడ ప్రవీణ్‌కుమార్, మెరిపో లావణ్య, మెరిపో విజయ్ కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కారు, మూడు స్కూటీలు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్ రేవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్‌బాబు వర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి

- విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీ నేతలు డిమాండ్
- నేడు విద్యా సంస్థల బంద్

తిరుపతిలోని జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

విద్యార్థి సంఘం నాయకులను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యం మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణును అరెస్టు చేయాలని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు వివిధ రాజకీయా పార్టీలు డిమాండ్ చేశాయి. విద్యాసంస్థల పేరుతో కొనసాగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని ఖండిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా తిరుపతి నగరం బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని లేదా ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో బౌన్సర్లను పెట్టుకొని, ప్రశ్నించే విద్యార్థులపై దాడులు చేయడం విద్యావ్యవస్థ మూల విలువలకు, ప్రజాస్వామ్య విద్యావ్యవస్థకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. ఈ తరహా దౌర్జన్య పద్ధతులు ఏ పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని, విద్యాసంస్థల్లో ఇటువంటి చర్యలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు పి.పవిత్ర, ఎఐఎస్ఎఫ్ జిల్లా నేత బండి చలపతి, కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటేష్ గౌడ్, ఆల్‌మెన్ రాజు, డిఎంసి.భాస్కర్ పాల్గొని మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఉపాధ్యక్షులు వినోద్‌లను కిడ్నాప్ చేయించిన ఘటన యాజమాన్య దౌర్జన్యానికి పరాకాష్టగా పేర్కొన్నారు. నేరం చేసిన వారిని వదిలేసి, ఉద్యమ నాయకులపై కౌంటర్ కేసులు పెట్టి భయపెడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులుగా వసూలు చేసిన 26 కోట్ల రూపాయలను కోర్టు ఆదేశాల ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే తీవ్ర ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శుక్రవారం జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను అన్నివర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కే.వేణుగోపాల్, సిపిఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, సిపిఎం, సిపిఐ నేతలు పాల్గొన్నారు.

ఇంకా చిక్కని పెద్దపులి

- రోజుకో ఊరిలో సంచారం

కలెక్టర్ కీర్తి చేకూరి, ఎంఎల్ఎ బలరామకృష్ణకు ఎర్రంపాలెంలో పరిస్థితిని వివరిస్తున్న ఎస్‌పి నరసింహకిశోర్

ప్రజాశక్తి - రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్

ఆరు రోజుల క్రితం తూర్పు గోదావరి జిల్లాలో ప్రవేశించిన పెద్దపులి రోజుకో ఊరులో సంచరిస్తూ జనాలకు ముచ్చెమటలు పట్టిస్తుంది. ప్రస్తుతం రాజానగరం మండలం జి ఎర్రంపాలెంలోని పామాయిల్ తోటలో మాటు వేసినట్టు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. బుధవారం రాత్రి భూపాలపట్నంలో ఒక ఆవు, జి ఎర్రంపాలెంలో మూడు దూడలను చంపేసింది. వీటిలో ఒక దూడను తినేసినట్టు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి ప్రత్యేక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుంది. ఈ బృందంతో పాటూ అటవీ శాఖ సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ జవాన్లు పులిని పట్టుకోవడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాత్రి పూట సైతం పులి సంచారాన్ని గుర్తించేందుకు థర్మల్ డ్రోన్ కెమెరాలను రప్పించారు. మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పివి చలపతిరావు, సిసిఎఫ్ బిఎస్ఎన్ మూర్తి, డిఎఫ్ఐ ప్రభాకరరావు, ఎఫ్ఆర్ఒ ఎస్ దావీదురాజు నాయుడు, ఎన్‌టిసిఎ అధికారి రాజశేఖర్, మత్తు వైద్యులు డాక్టర్ ఫణీంద్ర క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పులి సంచరిస్తున్న ఎర్రంపాలెం గ్రామాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్‌పి డి నరసింహకిశోర్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సందర్శించారు.

ఎయిలో తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా అధికారులు

పర్యాటక కేంద్రంగా మన్యం

- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి
- మహాలొద్ద జలపాతం ప్రారంభం



ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం)

పార్వతీపురం మన్యం జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి జి సంధ్యారాణి అన్నారు. జిల్లాలోని సాలూరు మండలం కొదమ పంచాయతీ పరిధిలోని లొద్ద గిరిజన గ్రామ సమీపంలోని మహాలొద్ద జలపాతాన్ని జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డితో కలసి ఆమె గురువారం పారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అనేక సహజ సౌందర్యాలు ఉన్నాయని, మరో ఆంధ్రా ఊటీలా జిల్లాను తీర్చిదిద్దుతామని అన్నారు. గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహా లొద్ద జలపాతానికి చేరుకునేందుకు వీలుగా ఆరు కిలోమీటర్ల మేర రహదారిని సుమారు రూ. ఆరు కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ రోడ్డు మార్గం పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరిగి, స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రకృతికి ఆనవాలమైన ఈ జలపాతం నుంచి అందాలను వీక్షించేలా పెద్ద గెస్ట్ హౌస్‌ను నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జలపాతం వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి, గిరిజనులు ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రారంభించి కాసేపు విక్రయాలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్ వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా అటవీ శాఖాధికారి ప్రసూన, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా ఎస్ మన్మధరావు, అటవీ రేంజ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా సంఘాలు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను నిర్మూలించాల్సిందే

- పార్కులు, రీసైక్లింగ్ కేంద్రాలు ఏర్పాటు
- సర్క్యులర్ ఎకానమీపై మార్గదర్శకాలు జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పరిశ్రమల ద్వారా ఉత్పన్నమయ్యే చెత్త ఇతర వ్యర్థాలను శుద్ధి చేసేందుకు అమలు చేసే సర్క్యులర్ ఎకానమీపై మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దశలవారీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టతనిస్తూ పరిశ్రమలశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. దీనికోసం సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటుచేసేందుకు, వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఈ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు, ఇంకా మిగిలిన వ్యర్థాలను తరలించేందుకు కూడా, ఇందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధంచేసేందుకు నిర్ణయించారు. సింగిల్ విండో విధానంతో వీటికి అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. వీటి నిర్వహణలో భద్రతా ప్రమాణాలు కూడా కొనసాగించాలని స్పష్టం చేశారు. అన్ని పరిశ్రమలు తమ పరిధిలో అవసరమైన ఏర్పాట్లుచేసుకుని, వాటిని కాలుష్య

నియంత్రణ మండలికి సమర్పించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి, భారీ, మెగా పరిశ్రమలు ఉత్పత్తి, ప్రాసెసింగ్, తరలింపు, మరమ్మతులు, రీసైక్లింగ్ అంశాలపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మెటీరియల్ రికవరీ, రీసైక్లింగ్ కేంద్రాలు, శుద్ధి ప్లాంట్లు, తరలింపు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లు అన్నీ రాష్ట్రంలోనే ఏర్పాటుచేయాలని నిర్దేశించారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను పంచాయితీలు, పట్టణ స్థానిక సంస్థలు సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. అలాగే పట్టణాలు, గ్రామాల్లో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను కూడా ఏలా పరిష్కరించాల్నదానిపైనా మార్గదర్శకాల్లో స్పష్టతనిచ్చారు.

ఆంధ్రా యూనివర్సిటీకి బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి యూనివర్సిటీ అధికారిక ఈ మెయిల్ ఐడికి వచ్చిన ఒక సందేశం వర్సిటీ అధికారులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. వర్సిటీ ప్రాంగణంలో బాంబులు అమర్చినట్లు ఆ మెయిల్‌లో పేర్కొనడంతో వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. విశాఖ త్రీ టౌన్ పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కలిసి వర్సిటీ క్యాంపస్‌కు చేరుకున్నారు. ప్రధానంగా ఉమెన్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ కార్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రద్దీగా ఉండే ఇతర విభాగాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మెటల్ డిటెక్టర్లతో అణువణువూ గాలించారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుండి వచ్చింది ? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెయిల్ ఐపి అడ్రస్‌ను సైబర్ క్రైమ్ విభాగం ట్రాక్ చేస్తోంది. యూనివర్సిటీ ప్రాంగణం మొత్తం పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నామని, భద్రతా చర్యలు పకడ్బందీగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు, బోధనా సిబ్బంది ఎవరూ ఆందోళన చెందొద్దని, పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్తగా క్యాంపస్ లోపలికి వచ్చే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఉత్తుత్తి బెదిరింపుల ద్వారా భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని త్రీ టౌన్ సిఐ పైడయ్య మీడియాకు తెలిపారు.

సిఐటియు రాష్ట్ర మహాసభ

ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా గఫూర్

- రాష్ట్ర మహాసభ లోగో ఆవిష్కరణ

నంద్యాలలో సిఐటియు మహాసభ లోగోను ఆవిష్కరిస్తున్న సిహెచ్.నర్సింగరావు, ఆహ్వాన సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 17, 18, 19వ తేదీల్లో సిఐటియు రాష్ట్ర 17వ మహాసభ జరగనున్న నేపథ్యంలో మహాసభ సన్నాహక ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీలోని వివేకానంద ఆడిటోరియంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ సన్నాహక ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, గౌరవాధ్యక్షులుగా ఆర్‌జిఎం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు, ప్రధాన కార్యదర్శిగా ఎ.నాగరాజును ఎన్నుకున్నారు. కోశాధికారిగా వి.యేసురత్నం, చీఫ్ ప్యాట్రన్స్‌గా గురురాజా విద్యాసంస్థల అధినేత డాక్టర్ దస్తగిరిరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు వంద మందిని, గౌరవ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర మహాసభలో పలు కీలక అంశాలపై చర్చలు జరిపి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు.

లోగో ఆవిష్కరణ

సిఐటియు రాష్ట్ర మహాసభ లోగోను నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.రాజశేఖర్, టి.రామచంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, నరసింహనాయక్ సిఐటియు, ప్రజా సంఘాల పాల్గొన్నారు.

భారత జిడిపిలో దక్షిణాది రాష్ట్రాలు కీలకం

- 2030 నాటికి రికార్డ్ వృద్ధి
- దేశ సగటు కంటే ఎక్కువ పెరుగుదల
- ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్-డిజర్వ్ రిపోర్ట్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత ఆర్థిక వ్యవస్థలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషించనున్నాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్-డెజర్వ్ తాజా రిపోర్ట్‌లో వెల్లడించింది. 2026-30 మధ్య కాలంలో దక్షిణాది రాష్ట్రాలు సగటున 6.8 శాతం జిడిపి వద్ధిని నమోదు చేయనున్నాయని విశ్లేషించింది. ఇది జాతీయ సగటు అంచనా 6.3 శాతం కంటే మెరుగ్గా ఉండటం విశేషం. దేశ ఆర్థిక కేంద్ర బిందువుగా దక్షిణాది నిలువనుందని తెలిపింది. రాబోయే ఐదేళ్లలో దేశ సగటు వృద్ధి రేటు కంటే దక్షిణాది రాష్ట్రాలే అత్యధిక పెరుగుదలను నమోదు చేయనున్నాయని వెల్లడించింది. 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకోవడంలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషించింది. ఈ పరిణామాలు కేవలం రాష్ట్రాల ఆదాయాన్నే కాకుండా ఇన్వెస్టర్ల సంపద సృష్టిలో కూడా పెను మార్పులు తీసుకురానున్నాయి. భారతదేశ ఆర్థిక ముఖచిత్రంలో దక్షిణాది రాష్ట్రాలు ఇకపై కేవలం భాగాలు మాత్రమే కాదని, దేశ వృద్ధికి అసలైన ఇంజిన్లుగా అవతరించాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

తమిళనాడు భళా..

ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్-డెజర్వ్ రిపోర్ట్ ప్రకారం.. 2026-30 మధ్య కాలంలో భారతదేశ సగటు జిడిపి 6.3 శాతంగా ఉండనుండగా.. దక్షిణాది రాష్ట్రాలు ఏకంగా 6.8 శాతం సగటు వృద్ధిని సాధించనున్నాయి. ఇందులో కర్ణాటక 7.4 శాతం, తెలంగాణ 7.2 శాతం వృద్ధి రేట్లతో నిలవబోతున్నాయి. తమిళనాడు ఏకంగా 16 శాతం వృద్ధితో దేశంలోని ప్రధాన రాష్ట్రాలన్నింటికంటే వేగంగా దూసుకుపోతుండటం విశేషం. ఈ రాష్ట్ర జిడిపి 2023-24లో రూ.26.88 లక్షల కోట్లుగా ఉండగా.. 2024-25లో రూ.31.19 లక్షల కోట్లకు చేరిన విషయాన్ని గుర్తు చేసింది.

వెన్నెముకగా ఐటి రంగం

ఈ భారీ పురోగతికి ఐటి, సాంకేతిక సేవా రంగాలు ప్రధాన శక్తిగా నిలుస్తున్నాయి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఐటి రంగం వాటా 13 శాతంగా ఉండగా, కర్ణాటకలో ఇది ఏకంగా 22 శాతానికి చేరి దేశంలోనే అత్యధిక వాటా కలిగిన రాష్ట్రంగా నిలిచింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఐటి రంగం రాబోయే కాలంలో 11 నుండి 12 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందని నివేదిక అంచనా వేసింది.

భారీ పెట్టుబడులు

అంతర్జాతీయ టెక్ దిగ్గజాల పెట్టుబడులు దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక శక్తిని బలోపేతం చేస్తోన్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌లో ఎఐ, క్లౌడ్ డేటా సెంటర్ల ఏర్పాటు కోసం రూ.1.46 లక్షల కోట్ల భారీ పెట్టుబడిని ప్రకటించిన విషయాన్ని ఆ రిపోర్ట్ గుర్తు చేసింది. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ కోసం రూ. 51,000 కోట్లను వెచ్చిస్తోందని పేర్కొంది.

భారతీ ఎయిర్‌టెల్ లాభాల్లో 55 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో భారతీ ఎయిర్‌టెల్ నికర లాభాలు 55 శాతం పతనమై రూ.6,630.5 కోట్లుగా నమోదయ్యాయి. ప్రధానంగా అధిక నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులు, ప్రభుత్వ ఫీజులు, ఉద్యోగుల వ్యయాల వల్ల లాభాలు తగ్గాయని ఆ సంస్థ పేర్కొంది. భారత రెవెన్యూ నిర్వహణ వ్యయం 13.2 శాతం పెరిగి రూ.39,226 కోట్లు పెరిగిందని పేర్కొంది. మొత్తం గ్లోబల్ వినియోగదారుల సంఖ్య 11.8 శాతం పెరిగి 57.6 కోట్లకు చేరినట్లు తెలిపింది. భారత్‌లో 12.6 శాతం వృద్ధితో 41.38 కోట్ల వినియోగదారులకు చేరారని పేర్కొంది. ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి (ఎఆర్‌పియు) 5.7 శాతం పెరిగి రూ.259కి చేరిందని తెలిపింది.

వడ్డీ రేట్లపై నేడు ఆర్‌బిఐ ప్రకటన

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసి) సమావేశం శుక్రవారంతో ముగియనుంది. మూడు రోజుల పాటు సాగిన ఈ భేటీలోని వడ్డీ రేట్లు, ఇతర అంశాల నిర్ణయాలను నేడు వెల్లడించనున్నారు. గత ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు కీలక రెపో రేటును 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అధిక వడ్డీ రేట్ల నుంచి రుణగ్రహీతలు మరోమారు ఉపశమనాన్ని ఆశిస్తున్నారు.

సట్టా లాంటిదే ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్

- మంత్రి సీతారామన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌ఒ) ట్రేడింగ్ అనేది ఒక రకమైన సట్టా వ్యాపారం లాంటిదేనని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అందుకే దీనిపై పన్ను పెంచాల్సి వచ్చిందన్నారు. అధిక రిస్క్ కలిగిన ఊహాజనిత వ్యాపారంగా భావించే ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్‌పై బడ్జెట్‌లో సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టిటి) పెంచిన విషయాన్ని తెలిసిందే. ఈ పన్ను పెంపును మంత్రి సమర్థించుకున్నారు. ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్ చేసే వారిలో దాదాపు 90 శాతం మంది నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కష్టార్జితం ఇలాంటి అధిక రిస్క్ ఉన్న లావాదేవీల్లో ఆవిరి కాకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇది ఓ రకమైన సట్టా వ్యాపారమని తెలిసినా.. ప్రభుత్వం గుర్తించినప్పటికీ దీనిని రద్దు చేయకుండా కొనసాగించడం గమనార్హం. రూపాయి పతనంపైనా మంత్రి స్పందించారు. మార్కెట్ శక్తులే రూపాయి విలువను నిర్ణయిస్తాయని తేల్చారు. తీవ్రమైన హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు మాత్రమే ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటుందన్నారు.

GRIHUM HOUSING FINANCE LIMITED
Joint Stock, Spot Platform

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: 6వ అంతస్తు, జి-బిల్డింగ్, గంగా ట్రూనో, లోహెగావ్, పూణే, మహారాష్ట్ర 411014.
బ్రాంచ్ ఆఫ్ యూనిట్: 1వ అంతస్తు, 48-6-23, శ్రీరామ్ సాయి గాయత్రి కాంప్లెక్స్, శ్రీనగర్ కాలనీ, రామా టాకీస్ రోడ్ దగ్గర, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530016

ఇ-వేలం- అమ్మకపు నోటీసు
సర్ఫేసి చట్టం కింద సెక్యూర్డ్ స్థిరాస్తి అమ్మకంపై ఇ-వేలం నోటీసు

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు 9 తో చదవబడిన ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ("చట్టం") కింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకపు నోటీసు. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు 9 తో చదవబడిన "చట్టం". గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై చట్టం ప్రకారం "సెక్యూర్డ్ క్రెడిటర్" అని పిలుస్తారు) కు తనఖా పెట్టబడిన క్రింద వివరించిన స్థిరాస్తుల స్వాధీనం గురించి ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు(లు)/ గ్యారంటర్(లు)కి ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది, చట్టంలోని సెక్షన్ 13(2) కింద నోటీసు (ప్రకారం సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల